# గరిట్లూ-చెంబాలూ

భీముడు గదపట్టుకున్న చేత్తోనే గరిట కూడా పట్టుకున్నాడు. ఇప్పుడు మన లేడీస్ గరిట పట్టుకునే చేత్తోనే కలం పట్టుకుంటున్నారు. శుభం! అల్లాగే కానివ్వండి. ఆ చేతిలోని గరిట వదిలేయకుండా వుంటే అంతేచాలు! కొందరు క్లైవరాతి క్లైవరు రమణులు ఆ గరిట అబ్బాయిగారి చేతికిచ్చి కథ నడిపిద్దామని చూస్తున్నారు. పాకశాస్త్రం కూడా శాస్త్రమే కదా. శాస్త్రమన్నాక అందులో స్త్రీ పురుష విచక్షణ కూడదుగా కెంత మాత్రం కూడదు, కూడదు. గృహ నిర్వహణ శాస్త్రం అబ్బాయిలు మట్టుకెందుకు అభ్యసించకూడదు? డొమెస్టిక్ సైన్సు చదువుకుంటే నిరుద్యోగ సమస్య అనేదే వుండదే? అయితే నోట్లోకి నాలుగు వేళ్ళూ ఎలాపోతాయని అడగొచ్చు. స్త్రీలను వంట నుంచి ఇంటి చాకిరీ నుంచి తప్పిస్తే వారు లోక కల్యాణం చేయటానికి ఎక్కువ వీలవుతుందని సంఘ పురోభివృద్ధి — కాముకులు నొక్కి చెబుతున్నారు. కాముకుల మాటలను స్త్రీలు అక్షరాలా పాటించనవసరంలేదు. బైదిబై మనం గరిటను వదిలేసి చాలాదూరం వచ్చాము.

గరిట్లలో మిల్లి గరిట్లని వున్నాయి సినిమాల్లో బాల తారల్లాగ, ఇవే కాదు ఇంకా నానా జాతులూ వున్నాయి. పులుసు గరిట, పప్పు గరిట, మజ్జిగ గరిట, అన్నం గరిట అనీ సవాలక్ష పదార్థాలకు సవాలక్ష గరిట్లు వుండి తీరుతాయి. మనిషికీ మనిషికీ ఆకార రూపురేఖాది విలాసాలలో

మార్పులున్నట్లే గరిటకూ గరిటకూ తేడాలుంటాయి. వుండాలి. సృష్టిలో వున్న వైవిధ్యమంతా గరిటల్లోనూ వుండితీరుతుంది. గరిటను తెడ్డు అని అనటం స్త్రీని ఆడది అని వెక్కిరించినట్లుంటుంది.

రుచిపాకము నాలుకగా కెరుంగునే తెడ్డది కూరలో కలయ ద్రిమ్మరు చుండిననైన భాస్కరా అన్నాడు కవి. కాని స్త్రీలు తెడ్డు చేత్తో పట్టుకుని



రుచిపాకము యెలావుందో తెలుసుకోవటానికి నాలిక వుపయోగిస్తారు. కూర ముక్కలు నోట్లో వేసుకుని చూడకుండా అమ్మడుకి పాపం వంట యెలా తగలడిందో యెలా తెలుస్తుంది ? తెలియ త్తెలియదు. తెడ్డుకి కూర రుచి తెలిస్తే అది మనదాకా వస్తుందిటండి మీ వెర్రిగాని, తెడ్డు తెడ్డే నాలుక నాలుకే.

గరిట తరువాత చెప్పుకోదగ్గ ఆయుధం అబలలకు అట్లకాడ అట్టు తిరగేయడానికి వుపయోగించే కాడవంటి సున్నితమైన పరికరం. దీన్తో

నైసుగా లప్పీగా తట్టుతేలేలా వాతలు పెట్టవచ్చు ఎవరైనా, యెవరికైనా. కొందరు లలనామణులు అట్లకాడను అస్తమానం తోముకోనవసరంలేదు. ఒకసారి నీళ్ళలోముంచి మళ్లీ మళ్ళీ వాడవచ్చు. వారానికోసారి చిళ్ల పెంకుతో బరికేస్తే చింతపండుతో తోమితే షైనింగు వస్తుంది అంటారు. అంట్లు తోముకోవడం బార్బరస్ అని కొందరంటారుగాని వారితో ఏకీభ వించటానికి వీల్లేదు. అది ఒక వ్యాయామం. ఎక్సరసైజు చేయమంటే స్త్రీలు ముఖం త్రిప్పుకుంటారు గదా. అంట్లుతోము కొనడం వలన మన యింట్లో ఏయే గిన్నెలు వున్నాయో ఏవి సొట్టలు పడ్డాయో, ఏవి కాళ్ళొచ్చి పరిగెత్తు కెళ్లాయో తెలుసుకొనవచ్చు. ఇది అక్కౌంటింగుకి పనికివస్తుంది. జేబురు మాళ్ల అస్తమాను పోయినట్లే చిన్న చిన్న చెంచాలు మూతలు పోతూ వుంటాయి.

చెంచాలంటే జ్ఞాపకంవచ్చింది. గరిటకు చెంచా మనవరాలని మీకు తెలుసా? చెంచాకు గరిట గ్రాండ్‌మదరైతే అట్లకాడ చెంచాకు మేనమావ అనాలిసిందే. మా పెద్దమావయ్య చెంచా అభారతీయం అంటాడు. తెలుగు డిక్షనరీలో చెంచా అనేమాట కనపడలేదు. డిక్షనరీలో కనపడక పోవటాని కేమీ ఆశ్చర్యంలేదు. కొంపలోనే అవసరానికి ఒక్క చెమ్చా కూడా కన పడిచావదు.

చెమ్చాలు కాళ్ళొచ్చి వెల్తాయో, వాటి పుట్టకే అంతేమోగాని అవి వున్నచోట వుండవు. కొత్తచోట్లకు జేబుల్లోకి బూట్లలోకి పుస్తకాల వెనక అలామారాకింద పనివేళావెళ్లి దాక్కుంటాయి. ఒకప్పుడవి అద్దం వెనకాల దేవుడు గూట్లోనూ బాత్రూంలోనూ కూడా కనిపిస్తాయి. చెంచాలు సర్వాం తర్యాములు ఇందుగల డందులేదని సందేహమువలదు.

చెంచా అభారతీయం ఉద్ధరిణే మన సంస్కృతి అని మా పెద్ద మామయ్యా అంటూ వుంటాడు. ఉద్ధరిణి డిజైన్ మటుకు చాలా ఓరి

యంటల్‌గా పకడ్బందీగా వుంటుంది. చెంచాలు సాదా సీదాగా వుంటాయి. వెండి ఉద్ధరిణలు, రాగి ఉద్ధరిణలు వున్నట్లే, వెండివీ, ఇత్తడివీ, స్టీలువీ, సత్తువీ అని నానా గోత్రాల్యా వున్నాయి చెమ్చాలు. ఇప్పుడిప్పుడే ప్లాస్టిక్ చెమ్చాలు కూడా విరివిగా వాడకంలోకి వస్తున్నాయి. చెంచాలు రకరకాలవి ప్రోగుచేయటం మంచిదే, కాని అవి మనింట్లోవే వుండాలి. లేకపోతే ప్రమాదం.

మనుషుల్లో ఖరీదైన మనుషులూ చవకబారు మనుషులూ అని వున్నట్లే చెమ్చాల్లో కూడా పలు వెరైటీ లున్నాయి. ఒక గరిట మరొక దాంట్లో న్యాయంగా పెట్టకూడదు. అల్లాగే యీ పాతివ్రత్యధర్మం చెమ్చాలకు కూడా వర్తిస్తుంది.

డాక్టర్లు మందు యిన్ని చెమ్చాలు తీసుకోండి అంటారు. అన్ని చెమ్చాలు మ్రింగమనికాదు డాక్టరు తాత్పర్యం. చెమ్చాలను వదిలేసి మందు మాత్రమే మింగాలని రూలు. నవలల్లో పెద్దసైజు నవల లున్నట్లే చెమ్చాల్లో కూడా మరీ పెద్ద సైజు చెమ్చాలుంటాయి. ఆ చెంచాలను జయంట్సు మాత్రమే వుపయోగించగలరు. చిన్న చిన్న చెంచాలు ముద్దుగా షోగ్గా నీటుగా వుంటాయి. చెంచాలు అప్పుడప్పుడు తలా తోకా తెలికుండా విరిగిపోతాయి. విరిగిపోయిన చెంచా కథ ఎవరైనా వ్రాస్తే వ్రాయవచ్చు. మన ఇళ్లలోని ఒక గరిట దగ్గర్నుంచీ చెంచా వరకు ఒక చిన్న హిస్టరీ వుండి తీరుతుంది. ప్రతిపని ముట్టుకూ ప్రతి స్వల్పవస్తువుకూ చరిత్రఉండే వుంటుంది. చెంచా కథలని ఎవరైనా రాస్తే రాయొచ్చు. ప్లాస్టిక్కు చెంచాలు నేను చాలా ప్రోగుచేశాను. రంగు రంగులవి అవి చాలా తమాషాగా ఉంటాయి. ఈ చెంచాలు వచ్చాక ఉగ్గు గిన్నెలు మూలబడ్డాయి. చెంచాతో ఆముదమైనా త్రాగించవచ్చు. అమృతమైనా త్రాగించవచ్చు. ఉప్పయినా

వేయవచ్చు. పంచదారైనా వేయవచ్చు. పాలైనా కలపవచ్చు. విషమైనా కలపవచ్చు. చెంచాను పట్టుకున్న చేతిదే ఆ శక్తి అంతా.

కడగని చెంచాలు కాలదోషం పట్టిన వాగ్దానాల వంటివి. నూరు చెంచాలయినా ఒక గరిటకు సాటిరావు. కాని గరిట పని గరిటదే చెంచా పని చెంచాదే. లోకంతీరే అంత, చెంచాలు తిరగబడే రోజు వచ్చినపుడు గరిట హిస్టరీ గల్లంతవుతుంది.